

# కలికాలం

## శ్రీ వెంపటి నాగభూషణం

'దయచేయండి...'

మహానస యౌవన సర్వాధికారి...నాయరు, టీ - మూడు ఫ్లాస్కులూ నింపి...సినీమాకు అని...బయట తాళంవేసుకుని - అప్పుడే వెళ్లిపోయినాడు.

ప్రతిభా విలసనానికి...ఉత్సాహ - సుంగళా చరణంగా, ధూమ...అమృతాస్వాదన ప్రవృత్తిని...సద్యోనిర్మిత భావసౌధమాలకు, వన్నెలు తీరుస్తూ...డాబామీద విశ్రమించి ఉన్నాను.

చక్కని బాబ్...అందమైన వేషం చాలా అందమైన రూపం: ఆ భావకవి కుమారుడు ఎవరో? గౌరవంతో ఆహ్వానించాను.

అతడు, మొగమాట పడుతూ!

'ఇంత ప్రొద్దుపోయి మీ ఏకాంతాన్ని భంగం చేయడం...'

నేను అడ్డపడి!

'ఎవరూ లేరు కనుక ఏకాంతం, ఫరవాలేదు ప్రొద్దుపోవడం ఏమిటి?...మన విషయంలో... ఎన్నడూ—గ్రుంకదు యానిశాసర్వభూతానాం' అని నవ్వుతూ అభయంగా హెచ్చరించాను.

నూతనభాయీ ఇంకా, కలతతోనే

'తమతో పనిఉండి మాట్లాడుదామని'

'అలాగే కూర్చోండి సంశయం ఎందుకు?'

'ఇంకా మనవాళ్లుకూడా వచ్చారు'

'ఏరీ'

' పిలుస్తాను '

ఒకరొకరే మబ్బుతెర తొలగించుకొని వాతే చంద్రుడి కిరణాలులాగా వచ్చి, నిలుచున్నారు. ఆ తాతగారు వెండి నిగనిగల గడ్డంతో దివ్య సౌష్టవంతో వేదరూపావతారంలాగు చూడ వేడుకగా ఉన్నాడు.

ఆమె పండు చక్కదనంతో యావనోదయం వేళ నాగరక లోకాన్ని నోరూర తహతహ లాడించిన విలాసచ్ఛాయలతో ఇంకా కాంక్ష ణీయంగానే ఉన్నది.

ఆతడు అఖిలాప్స రోగంనా విటుడికి సహజ మైన రాసిక్య దర్జాతో ఉత్తమలక్షణ లక్షి తుడుగా !—

ఆ నలుగురికీ ఆసనములు అమరిచి ఉప విష్టులైన తరువాత టీపాయ్ తెచ్చి నడుమగా ఉంచాను.

ఆమె ఇల్లాలి ఆదరణతో లేచి లోపలికి వెళ్లివచ్చి మా కందరికీ టీప్రదానం చేసింది, స్వతంత్రించి !

సిగరెట్ వెలిగించి టిన్ అందరికీ అందు బాటుగా అందిచ్చే మర్యాదతో ముందుకు జరిపి సావధానున్ణి అయినాను. వారు ఎవరూ, స్వీకరించలేదు.

మౌనం

' ఇక ఉపక్రమించండి ' – అని చూపులతో అందరినీ రెట్టించాను.

' వీరు దేవగురువు – బృహస్పతి ' అని కవి కుమార వేషధారి తల ఊగించి తాతగారిని నిర్దేశించాడు.

' ఈతడు దేవరాజు, శతక్రతుడు' – అంటూ తాతగారు విలాస పురుషుణ్ణి ఇంద్రుని తెలియ పరచినారు.

అంత, ఆయన అందుకొని !

' ఈమె దేవమోహిని రంభ '

ఆమె తనవంతుగా

' ఈ మహానుభావుడు నారదుడు ' అని కవి కుమారుని !

నమ్మినాను. ఆశ్చర్యపడలేదు. సబబుగా స్వాభావికంగానే ఉన్నది.

' గురుపాదులు విషయం వివరిస్తారు ' అని ఇంద్రుడు కార్యభారం తాతగారిమీాద వేశాడు.

ఆయన గొంతు సవరించుకోకుండా మసల కుండా యకాయకిని.

' విపరీత సిద్ధాంత ప్రచారంవల్ల ప్రస్తుతం స్వర్గం దేవస్వామ్య ప్రభుత్వంగా మారిపోయింది. అమర కుమారులసామ్యవాదావలంబన పరిణా మంగా దేవరాజు రాజ్యచ్యుతు డైనాడు.

' విప్లవ నాయకుడైనా తండ్రిని యీా స్థితికి తీసుకుని వచ్చినా మమత వీడలేక శచీదేవి జయంతుడి దగ్గరే నిలిచిపోయింది. మేము పూవు లమ్మిన ఊరిలో...అన్ని మీా సామెత ఉన్నదే ! అక్కడ ఉండడానికి యిష్టంలేక మాకు, ఇంకా ఈ లోకంలో పూజ్యభావం కొరవడలేదనుకొని తలదాచుకునేందుకు తరలివచ్చాము '

' మేము ధన్యులము ' అని మోకరిలి, సాంజ లినై సవినయ – కృతజ్ఞతను విన్నవించాము.

'ఉహుఁ, అదికాదు. పూజలందు కొనడానికి కాదు, మేము వచ్చినది. మీతో కలిసిపోయి సామాన్య మానవులులాగా ఉచిత ధర్మాచరణం వల్ల!'

'తమ అభిప్రాయం'

'తేట తెలుగున చెపుతాను. ఎదైనా ఉద్యోగం. ఉద్యోగాలు దొరికితే'

తెల్లబోయినాను. కలా నిజమా?

'సంశయించవద్దు నిజమే. మీ సలహా కోసం మీ దగ్గరకు'

'తాము ఈ విధేయపరమాణువును 'మీరు' అని సంబోధించడం'

'మరచిపోతున్నారు. సామాన్యమానవులు, సాటి పెద్దమనుష్యులు,—ఒకరినొకరు అలా అనుకుంటారు. ఆఁ మీదగ్గరకే వచ్చింది. నచ్చచెప్ప నవసరం లేకుండా నమ్ముతార నే. సరేనా?'

తల ఊపాను

'స్వవిషయం:—గీర్వాణంలో కావ్యశాస్త్రాదులతో నాకుఉన్న పరిచయం విజ్ఞులైన మీకు విశదమే:—ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధ్యాపక పదవి ఎదైనా లభించడానికి అవకాశం'

'క్షమించాలి అది లభించదేమో?'

'ఏమి?'

'తమ యోగ్యతకు నిదర్శనం'

'బాబూ మీ ప్రస్తుత సంప్రదాయాలు తెలియవు కనుక నే-అడుగుతున్నాను. సంకోచం లేకుండా చెప్పవలె'

'తమకు ఉభయ భాషా ప్రవీణకాని, విద్వాన్ కాని, ఎం. ఏ. కాని ఈలాటివేమీ సంపాదించలేదు. పోనీ, వృద్ధులు కనుక పండితులు కనుక ప్రయత్నం చేద్దామన్నా, సర్వీస్ లేదు, ఎబ్బే అదేమీ ప్రయోజనం లేదు. అన్యథాభావించరని తలచి మనవిచేస్తున్నాను. సుఖంగా కాలక్షేపం కావాలని ఉంటే ఆశ్రమ స్వీకారంచేసి పీఠాధిపత్యం సృష్టించుకోండి. మీ పాండిత్యానికి వినియోగం లేకపోయినా, పాద ఉదర పూజలు సుష్టుగా జరుగుతవి'

ఒకరినొకరు చూసుకున్నారు. మనసులతో కూడబలుకు కుని ఆలోచిస్తూ ఊరుకున్నారు.

'ఇక నాకథ' - అని బ్రహ్మమానస పుత్రుడు.

'మీరు' మీకేమండీ సినీమాలో నాటకాల్లో వేషాలు వేయవచ్చును. మీ దివ్య గానానికి - అని అమితోత్సాహంతో జవాబు దూకించాను.

'మీరు గమనించినట్లు లేదు. మహతి అక్కడే వదలివచ్చాను' - అంటూ కలహాశనుడు చిన్నబుచ్చుకున్నాడు.

'ఆర్కెస్ట్రాలో వాద్యకుడుగా, కాదు వెళ్లమన్నది. మీ అమృత - అమర దివ్యగాన వాహినులు'

రంభ పడుచుపిల్ల పరువముతో పకపక నవ్వుతూ ఆతన్ని చూసి 'చెప్పవేం ఇంకా దాచి లాభం లేదు' అని కొంటెతనం చేసింది.

'నేను పాడలేను' - నారదుడు చాలా సిగ్గుపడుతూ అన్నాడు.

'ఆహాఁ నిజంగా' నమ్మలేని ఆశ్చర్యంతో నేను యదార్థాన్ని సంశయించాను. అవునని రంభ తలతిప్పింది.

'పాట పాడడం దివ్యగానామృతం వర్షించడం – మహతి. నేను కేవలం నాదాన్ని లోకాలవెంట మోయడమే'

'అలాగేం గట్టిచిక్కే వచ్చిందే? పోనీ ఇలా చేయండి మీ పేరుతోనే వ్యవహరించడానికి వీలవుతుందా?'

'అప్పుడు'

'నారదుడు వేషం వేస్తున్నాడంటే జనం విరగబడుతారు. అదీ ఒక్క సినీమాకు అయితేనే వీలుఉన్నది. ఇంకొకరిచేత పాడించి సింక్రొనైజ్ చేయవచ్చును'

'ప్రచ్ఛన్నంగా వర్తించడం ముఖ్యవిధి అని నేను మనవిచేసింది మీరు విస్మరిస్తున్నారు'

'అయితే ఒక్కటే ఉపాయాంతరం కనబడుతూన్నది. పారవశ్యం – ఆవేశం అభినయించగలరా?'

'ఓ పుట్టినప్పటి నుంచీ చేస్తున్నపనే అది'

'అయితే భజన సమాజం స్థాపించండి'

ఈ సూచనకూడా మౌనపర్యాలోచనానంతరం అంగీకార లాభాన్ని సంగ్రహించుకున్నది.

'ఏమమ్మా మీరు' – అని రంభను పలుకరించాను.

'ఏం చేయమ్మంటారు' – అని చాలా ఆప్యాయంగా అమాయకంగా చిరునవ్వులో సమీపించింది.

'నాట్యాభినయమ్ములలో...'

'నిధి' – అని దేవరాజు అందిచ్చాడు.

'కాని క్షమించండి పడుచుపిల్ల అయితేనే గాని. భరతాభినయప్రదర్శనాలకు పైసా పలుకదు'

'పోనీ నేర్పుతాను'

'ఎవరికి? సానులు కళాజీవనం మానుకుని సామాన్య గృహిణులుగా తయారు కావడానికి కట్టుదిట్టములు చేసుకుంటున్నారు'

'ఇంకా ఇతరులు'

'ఉన్నారు నేర్చుకుంటారు కాని, ఫాక్స్ ట్రాట్... వాల్ట్జ్ ఈలాటివి మీకు రావుకదూ'

'ఆ సంగతి రవంత ఆలోచనలో పడనిచ్చి నా నా మాట తేల్చండి. పురుషులందరూ అయిన తర్వాత, ఈ వయ్యారి' అంటూ, దేవరాజు సరసోక్తులతో. అడ్డుతగిలాడు.

'మీరు ఏం చేయాలని ఉన్నది?'

'ఏమో, ఏమీ తోచడం లేదు'

'అయినా'

'ఇదివరకల్లా ఐరావతాన్ని ఎక్కి నందనవనంలో తిరగడం, అచ్చరల ఆటపాటలతో కాలం గడపడం, సోమపానం చేయడం, కులాసాగా కొలువు చేయడం, మీకు తెలిసిందే కదా? ఇంతకు మించి ఏమీ పనులుచేసే అలవాటు లేదు. మరి, ఇప్పుడు'

'కుబేరుడు'

'ఆతని పని బాగుంటే ఏచిక్కు లేకపోను. సర్వ సంపదలూ నవనిధులూ అందరూ పంచుకున్నారు, ఊడలాక్కుని! మాతో కలసిరానని అమెరికా లేదూ – పాశ్చాత్యఖండం – ఆ త్రోవ పట్టాడు. అతనికి ధనేషణ పూర్వమంత ముమ్మరం

గానూ ఉన్నది. మేము భారతవర్షాన్ని విడువ లేక ఇక్కడకు——

'ఉండండి. మహామజా అయిన ఊహ తోచింది. ఇన్సూ్స్యరెన్సు కంపెనీ పెట్టరాదూ? నారదులవారు అర్జన్టైజరుగా బాగా పనికి వస్తారు - ఎప్పుడూ సంచారంచేసే అలవాటున్నది గనుక గురువులవారు - సెక్రటరీ, రంభమ్మగారు - కాన్వాసర్ - అందరూ ఒక చోటనే ఉండవచ్చును - యథాపూర్వంగానే, లోకులందరి పుణ్యా పాపాలూ కాక ప్రాణాలూ కూడా మీ చేతిలోనే ఉంటవి.

'నెగ్గలేనేమో ? నిర్వహించ లేకపోతే'

'కంపెనీదోవను అదిపోతుంది? మీకమీషన్ కు లోపం ఉండదు. కాలుకదల్చ నవసరంలేకుండా సుఖజీవనం చేయవచ్చును. ఏమంటారు ?

'బాగానే ఉన్నది. కాని ఆలోచిస్తాను ఈ విషయం'

రంభ, సైగచేసి నన్నుపిలిచి దూరంగా తీసుకువెళ్లి 'నాకు అది ఇష్టంలేదు' అన్నది మారాముచేస్తూ.

'ఏది ?'

'మీరు చెప్పారే, ఇప్పుడు - కంపెనీ. అది నచ్చడంలేదు. నా ఆటపాటలకీ చాకచక్యానికీ వినియోగం వుండేలాగు కళాసంబంధమైన'

—ఆలోచించి చూశాను ఊం.

'అయితే ఒక క్షేత్రోవ కనబడుతూన్నది. మీ వయస్సు మనుష్య మానాన్ని బట్టి మనవి చేస్తున్నాను. మీ విగ్రహగాంభీర్యం అనువుగానే ఉన్నాయి. స్టేజిమీద మగవేషం వేయడానికి ఇష్టమేనా ?'

రంభ రిచ్చపడి పోయింది.

'మగవేషమా? బావగారు పరిహాసంకోసం అంటున్నారు' అని వయ్యారం తెచ్చిపెట్టుకుంటూ మరీ దగ్గరకు రాబోయింది.

నేను వెనుకకు తగ్గి.

'తమతో మాతృసమానులైన తమతో— మీకేం మతిపోయిందా? - చూపుతో వాక్యం పూర్తిచేశాను...ఆమె నవ్వుతూ.

'మీది యజ్ఞాదికములు అవిచ్ఛిన్నంగా జరిగిన సనాతనవంశం. మనకు సరసాలవరస ఉన్నది. నాకు మీమీద ఆ స్వాతంత్ర్యం ఉన్నది. సరి, దానికేంగాని, నిజమేనా—మొగవేషం వేస్తే బాగుంటానా? నవ్వకుండా నావంక చూసిచెప్పండి'

నమ్మించాను.

'మరి ఆయన మాట ?'

'ఎవరూ ?'

'ఇంద్రుడు'

'మీరు మగవేషం, ఆయన ఆడవేషం' మాటవరుసను అనేశాను, ఆలోచించకుండాను.

రంభ చిన్నపిల్లలాగ గంతులు వేస్తూ

'బాగున్నది' అని, సంతోషించింది.

'ఊరికే అన్నాను'

రంభ నిరుత్సాహంతో

'అంతేనా నేను నిజమనే అనుకున్నాను' అని ఉస్సురన్నది.

పరాకున మీద చెయివేసి సమాశ్వాసిస్తూ 'ఆయన ఒప్పుకుంటాడా ?...వేయగలడా అని, నా అనుమానం' అన్నాను.

'ఓ ఒప్పించేభారం నాది. అలవాటు ఉన్నది కాదూ వేషం వేయడంలో'

'ఎప్పుడు వేశారు ?'

'పూబోడికోసం కోడివేషం వేయగా లేనిది వచ్చిన బహుమానాలూ పతకాలూ, తెలుసును కాదూ, అవసరం గడుపుకునేందుకు ఆడవేషం వేయడేం? నాదీ పూచీ'

'ఏమిటా దేవరహస్యాలు, ఎంతకూ తెమలకుండా ఉన్నవి?' అని నవ్వుతూ శతమన్యుడు మమ్మొలను సమీపించాడు.

నేనేమీ చలించలేదు. మాటాడలేదు. రంభ ఆయనవైపు తమాషాగా చూసి సంభ్రమంతో సంరంభంతో

'ప్రియురాలా' అని కౌగలించుకున్నది. అతడు తత్తరపడి విడిపించుకుని.

'ఏమిటి ఈ విపరీతం' అని కలవరపడినాడు.

'తరువాత చెపుతాను రండి'

శారద - దేవగురుల వద్దకు వచ్చాము. వారు లేచి నిలుచున్నారు.

'ఇక ఉంటాము. మళ్లా వీలైనప్పుడు'

'అలాకాదు. తమరు అందరూ ఇక్కడే ఉండిపోయి నన్ను ఆదరించాలి. అమృతోపచారములు కరవైనా'

'మీ టీ రుచిచూసిన తరువాత అమృతం వెగటౌతున్నది' అని రంభ మేలమాడింది.

'ఉండాలి తప్పదు' ప్రాంజలినై బ్రతిమాలు కున్నాను.

అందరూ చిరునవ్వు. బిగ్గరగా రంభ. కలహాసం... సన్నగిలుతూ ... దూరాన్నుంచి... దూరంగా దూరంగా వీణెమీటినట్లు.

* * *

'ఆట చాలా బాగున్నది. అయ్యో'

చాప పరుచుకోబోతూ నేను మెళకువగా మసలుతూండడం చూసి నాయరు పలుకరించాడు.


చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును
శగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

గొనో కిల్లర్ (రిజిష్టరుబడ)

కృత్రిమములకు జాగ్రత్త "కోడి మార్కు"ను చూసి కొనుడు

ఈ ఔషధము ఇంగ్లీషు మందులను దేశీయ ఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను, వాక్సినులవలనను గూడ లాభములేక పోయినయెడల, కడపటి ప్రయత్నముగా మా గొనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. మూత్రము ఝూరీగా వెడలును. మూత్రము పోవుచున్నపుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును. మూత్రము బొట్టుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారము నుండి పోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు, నరముల జబ్బు మున్నగు వ్యాధులన్నియును స్త్రీలకున్ను పురుషులకునుగూడ గొనోకిల్లరువలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3—0—0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు.

మా పుంజుమార్కు గమనింపుడు. వి. పి. చార్జీ ప్రత్యేకము. అడ్రెసు :—డాక్టరు డి. యన్. జస్సాని గిర్గాము వెనుకరోడ్డు, బొంబాయి

Dr. D. N. JASANI, Girgaum Back Road, Bombay 4
Madras Agents :—DADHA & CO., Nainiappa Naick St., P. T., Madras